కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బోరబండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బోరబండ బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ అధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి పొన్నం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజాపాలనను అందిస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనను చూసి బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని కార్పొరేటర్ బాబా అన్నారు. పార్టీలో చేరిన వారిలో లక్ష్మణ్‌గౌడ్, ఆనంద్‌కుమార్, బాలరాజ్, రవీందర్, కిరణ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అశోక్, నరసింహ, కాసుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే టీసీ ఇచ్చి పంపిస్తాం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్

ఖైరతాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, ఉస్మానియా యూనివర్శిటీ నిబంధనల ప్రకారం విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సైఫాబాద్ సైన్స్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ హెచ్చరించారు. బుధవారం కళాశాలలో కొత్తగా అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులతో కలసి యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఇందులో మాసాబ్‌ట్యాంక్ పోలీసులతో పాటు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ర్యాగింగ్ చేస్తే విద్యార్థులకు టీసీలను ఇచ్చి ఇంటికి పంపడం ఖాయమని, అలాగే వారికి స్కాలర్‌షిప్పులు సైతం రావని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీశ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, ప్రతినిధులు డాక్టర్ ఎం.వెంకటరమణ, డాక్టర్ మీనాక్షి, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

మురికివాడలో మెరిసిన ఆణిముత్యం



మౌనికను సత్కరిస్తున్న మంచ్ ప్రతినిధులు

ఖైరతాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక బాధలు, కుటుంబ సమస్యలను అధిగమించి చార్టెడ్ ఎకౌంట్ చదువును పూర్తి చేసిన మౌనికరెడ్డిని ఖైరతాబాద్ వికాస్ మంచ్ అధ్వర్యంలో బుధవారం సత్కరించారు. మహాభారత్‌నగర్‌కు చెందిన మౌనిక తండ్రి ఆటోడ్రైవర్. మురికివాడ ప్రాంతమైన మహాభారత్‌నగర్ నుంచి మెరిసిన ఆణిముత్యంగా పేర్కొంటూ ఖైరతాబాద్ వికాస్ మంచ్ నిర్వాహకులు డాక్టర్ నిమ్మ బాబూరావు, ప్రతినిధులు ఆమె స్ఫూర్తితో మరికొందరు యువత ఉన్నత చదువులకు ముందుకు రావాలనే కాంక్షతో ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఉత్తం శ్రీనివాస్, ఆస సాయి కృష్ణ, రాజేందర్ తదితరులున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు అందరి సహకారం అవసరం



సీఐ శ్రీనివాసులుతో స్థానిక నాయకులు

ఎర్రగడ్డ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో స్థానిక సంక్షేమ సంఘాల నాయకుల సహకారం ఉండాలని సనత్‌నగర్ సీఐ కె.శ్రీనివాసులు అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎర్రగడ్డకు చెందిన పలు పార్టీలు, సంక్షేమ సంఘాల నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారం ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని అన్నారు. సీఐని కలిసిన వారిలో దూడల రవి గౌడ్, మహమ్మద్ మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణ కుమార్, ఘంటా మల్లేష్, సర్దార్, దూడల సురేష్ గౌడ్, శశి కుమార్, సయ్యద్ మోసిన్, తదితరులు ఉన్నారు.

టీటీడీని భ్రష్టు పట్టించింది మాజీ సీఎం జగనే

బంజారాహిల్స్, జూలై 24(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం భ్రష్టు పట్టడానికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే కారణమని బీజేపీ నేత, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీకి వచ్చే భక్తులను మంచినీటికి కూడా ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. అన్య మతస్థులను చైర్మన్‌గా పెట్టి శ్రీవాణి టికెట్ల ద్వారా భారీగా అవినీతికి పాల్పడ్డారన్నారు. కరుణాకర్‌రెడ్డి, వైవి సుబ్బారెడ్డి చైర్మన్‌లుగా వ్యవహరించినప్పుడు జరిగిన అక్రమాలపై సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై త్వరలో ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవించనున్నట్టు చెప్పారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

యూసుఫ్‌గూడ, జులై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కొన్ని రాష్ట్రాలకే అనుకూలంగా ఉందని రహ్మత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్ వద్ద కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదిరతరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న కొలను లక్ష్మి

సనత్‌నగర్ (ఆంధ్రజ్యోతి): సనత్ నగర్ అశోక్ కాలనీ పాత ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కార్పొరేటర్ కొలను లక్ష్మి విద్యార్థుకు యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మార్తా, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఫహీం ఫాతిమా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతరకు ఆలయాలు ముస్తాబు

● పూర్తయిన విద్యుత్ దీపాల అలంకరణ ● సిద్ధమైన ఎర్రగడ్డ మహంకాళి టెంపుల్ ● ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయ కమిటీలు



సిద్ధం చేసిన ఫలహారం బండి



కొత్త రంగుల్లో ఎర్రగడ్డ ఆలయం

ఎర్రగడ్డ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని మహంకాళి ఆలయంలో బోనాల వేడుకలు గురువారం నిర్వహించడం ఆనవాయితీ. నగరమంతా ఆదివారం ఉత్సవాలు నిర్వహించినా.. ఇక్కడ మాత్రం ఏళ్లుగా గురువారమే నిర్వహిస్తారు. ఒకేరోజు బోనాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. తెల్లవారుజాము నుంచే మేలుకొలుపు సేవతో జాతర ప్రారంభమవుతుంది. నైవేద్యాలు, బోనాలతో మహిళలు అమ్మవారి చెంతకు చేరుకుంటారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. రాత్రి నిర్వహించే తొట్టెల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఎర్రగడ్డలోని ఆనంద్ నగర్, ప్రేమ్ నగర్, న్యూప్రేమ్ నగర్, ఎర్రగడ్డ బంజారా నగర్, ప్రజలు గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

ప్రకాశ్‌నగర్ భూలక్ష్మి ఆలయంలో..

బేగంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాల నేపథ్యంలో బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉన్న భూలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. రంగులువేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. 28న జరిగే ఆషాఢ బోనాలకు అవసరమైన పూర్తి ఏర్పాట్లను చేసినట్లు ఆలయ ఫౌండర్ విశాల్ సూదం, ఈఓ విఠలయ్య తెలిపారు. 28న ఉదయం 5 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత, హరిద్రోదక, కుంకుమ సహిత అభిషేకంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి.





ముస్తాబైన భూలక్ష్మి అమ్మవారి ఆలయం



అధికారులతో మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

● బోనాల జాతర ఏర్పాట్లపై సమావేశం

యూసుఫ్‌గూడ, జులై 24 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అధికారులకు సూచించారు. రహ్మత్‌నగర్ బ్రహ్మశంకర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో బుధారం ఏర్పాటు చేసిన సమావేశంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి అధికారులు, స్థానిక బస్తీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. స్థానికులు కోరిన విధంగా ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ మేలు చేసేలా కేంద్ర బడ్జెట్

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చింతల

బంజారాహిల్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ నినాదంతో అన్ని వర్గాలకు మేలు చేసేలా కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సామాన్యుడికి అనుకూలంగా బడ్జెట్ ఉందని హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం వెంకటేశ్వర నగర్‌కాలనీలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సును ఆలోచించి బడ్జెట్ ప్రవేశపెడితే దాన్ని విమర్శించడం సీఎం రేవంత్‌రెడ్డికి తగదన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ పరిధి దాటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఫిలింనగర్ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి బీజేపీ కౌన్సిల్ మెంబర్ భోజిరెడ్డి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనరంజక బడ్జెట్‌తో దేశానికి మేలు

బేగంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ జనరంజకంగా ఉందని సోమాజిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జీ. సూర్య వినాయక్ అన్నారు. సోమాజిగూడలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి ప్రధాని మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు ఎంతో మేలు చేస్తుందన్నారు.



సోమాజిగూడలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

యూసుఫ్‌గూడ బస్తీ చౌరస్తాలో..

యూసుఫ్‌గూడ, జులై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ యూసుఫ్‌గూడ బస్తీ చౌరస్తాలో.. ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, చంద్రమోహన్, పులిరాం, జ్ఞానేశ్వర్, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఆ పార్టీ నగర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ -బంజారాహిల్స్, జూలై 24(ఆంధ్రజ్యోతి)

ఆక్రమించిన డబుల్ ఇళ్లకు తాళాలు

● ఖైరతాబాద్‌లో రెవెన్యూ, హౌసింగ్ అధికారుల దాడి

● ఇళ్లను స్వాధీనం చేసుకొని సీల్ వేసిన అధికారులు

ఖైరతాబాద్, జూలై24(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఇందిరానగర్‌లోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించగా మిగిలిన ఇళ్లను అక్రమంగా స్వాధీనం చేసుకున్న వారిపై అధికారులు కొరడా ఝులిపించారు. బుధవారం రెవెన్యూ, హౌజింగ్ అధికారులతో పాటు పోలీసులు మూకుమ్మడిగా దాడులు జరిపి ఆక్రమించుకున్న ఇళ్లను తిరిగి స్వాధీనం చేసుకొని సీల్ వేశారు. ఖైరతాబాద్‌లోని నాలుగు బ్లాకుల్లో మొత్తం 210 ఇళ్లను నిర్మించగా అందులో 200 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించింది. అర్హులమైనా తమకు ఇళ్లు రాలేదని కొందరు, వారిని చూసి మరికొందరు కేటాయించని ఆ 10 ఇళ్లను స్వాధీన పరచుకున్నారు. అందులో ముగ్గురు నివాసముంటుండగా ఏడుగురు ప్రభుత్వం వేసిన తాళాలను విరగొట్టి తమ తాళాలు వేసుకొని కబ్జాలో ఉంచారు.

కేసులు పెడతామని హెచ్చరిక

ఇళ్లను ఆక్రమించుకునే విషయమై కొందరి మధ్య తగాదాలు రావడంతో ఆ విషయం ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే పోలీసుల సహకారంతో ఆక్రమణలపై ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి వాటిని తిరిగి స్వాధీనం చేసుకొన్నారు. అక్రమార్కుల వివరాలు సేకరించామని, కలెక్టర్ ఆదేశాలు రాగానే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కాగా తాము సీల్ వేసిన ఇళ్లను ఎవరైనా తిరిగి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఉప తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐలు, హౌజింగ్ శాఖ ఎఈ మహేష్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్‌ఐలు, పెద్ద ఎత్తున సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటికి సీల్ వేస్తున్న అధికారులు

వేడుకగా ఫలహారం బండి ఊరేగింపు



ఫిలింనగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు

బంజారాహిల్స్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్లు, డీజే హోరు నడుమ అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు బొప్పారం వేణుకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యకరమంలో ఎమ్మార్పీఎస్ నేతలు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి పీవీ. నర్సింహ, ప్రధాన కార్యదర్శి కొండ్రుపల్లి శివకుమార్, కండె రామ్‌కుమార్, ఎంఎస్‌పీ అధ్యక్షుడు రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్థుల మధ్య ఆధిపత్య పోరు.. ఒకరి హత్య



ఖాజా పాషా

బంజారాహిల్స్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పాత నేరస్థులు అనేక మార్లు జైలుకు వెళ్లి వచ్చారు. అయినా వారి తీరు మారలేదు. స్థానికంగా పైచేయి తమదే కావాలని పలుమార్లు గొడవకు దిగేవారు. ఈ గొడవల్లో ఒకరు హత్యకు గురయ్యారు. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు నంబరు 10 సింగాడ బస్తీకి చెందిన ఖాజా పాషా(20) దొమ్మిలు, దొంగతనాలు చేసి పలుమార్లు జైలుకు వెళ్లాడు. ఇప్పుడు ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోడ్డు నంబరు 12 ఎన్‌బీ నగర్‌కు చెందిన పర్ష కూడా పలు కేసుల్లో నిందితుడు. ఓ కేసులో పదిహేను రోజుల క్రితమే జైలు నుంచి బయటకు వచ్చాడు. . 23న రోడ్డు నంబరు 13 శ్రీరాంనగర్‌లో పాషా, పర్ష, వీరి స్నేహితులు మహేష్, వంశీ, సాయి కలిసి మద్యం తాగారు. మత్తులో పాషా, పర్ష మధ్య మరోసారి గొడవ జరిగింది. పాషా ఆగ్రహంతో పర్షను కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కక్ష్య పెంచుకున్న పర్ష ఎలాగైన పాషా అడ్డు తొలగించాలని భావించాడు. ఇందుకు మహేష్, వంశీ, సాయి సహాయం కోరాడు. అదే రోజు రాత్రి పాషా రోడ్డు నంబరు 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఓ స్నేహితుడి ఇంటికి వెళ్లినట్టు తెలిసింది. నలుగురు కలిసి ఒకే ద్విచక్ర వాహనంపె వెళ్లి పాషా రాగానే పర్ష దొడ్డు కర్రతో తలపై బలంగా మోది అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు పాషాను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఆధారాలు సేకరించడంతో పాటు మహేశ్, వంశీ, సాయిలను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సంగీతాయాదవ్

బంజారాహిల్స్, జూలై 24(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నట్లు సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ తెలిపారు. ఎల్లారెడ్డిగూడ నాగార్జున నగర్ కాలనీ నాగదేవతా ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతంలో పైప్‌లైన్ పూర్తయిన తర్వాత రోడ్డు పనులు మొదలు పెట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. వర్షాకాలంలో వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అక్కడ సమస్యను పరిష్కరించేలా అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. పలు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వనం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మరదలు వైద్యానికి డబ్బు కావాలంటూ మోసం

యూసుఫ్‌గూడ, జులై 24 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి ఖర్చులకు నగదు కావాలంటూ మోసగించిన వ్యక్తిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలో నివసించే వంశీకృష్ణ వ్యాపారం చేస్తుంటాడు. అతనికి 21వ తేదీన నాలుగు వాట్సప్ మిస్‌డ్ కాల్స్ వచ్చాయి. ఆ నంబరుకు ఫోన్ చేయగా అమెరికాలో ఉన్న తన మరదలు ఎమర్జెన్సీగా ఉందని డబ్బు కావాలని తెలిపారు. ఆమెను సంప్రదించేందుకు వంశీకృష్ణ ప్రయత్నించగా నెట్‌వర్క్ సరిగ్గా లేదు. అవతలి వైపు నుంచి క్యూఆర్ కోడ్ వచ్చింది. దానికి రూ.46వేలు పంపాడు. అయినా ఇంకా కావాలని అడగటంతో అనుమానం వచ్చి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



ధర్నా పోస్టర్‌ను అవిష్కరిస్తున్న నాయకులు

పంజాగుట్ట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తేవడానికి ఆగస్టు 1, 2న చలో ఢిల్లీ అలాగే జంతర్ మంతర్ వద్ద దండోరా ధర్నా చేపట్టుతున్నామని వారు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ధర్నా పోస్టర్, కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణపై గడిచిన పది సంవత్సరాలుగా మాదిగ సామాజిక వర్గాన్ని బీజేపీ మభ్యపెడుతుందని వారు ఆరోపించారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చింత శ్యామ్ మాదిగ, రాష్ట్ర యువసేన అధ్యక్షుడు జి.నరేష్, బి.శాంతి కుమార్, లక్ష్మణ్ మాదిగ, ప్రకాష్ మాదిగ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కదిరె కృష్ణ వ్యాఖ్యలను వక్రీకరించడం సరికాదు



మాట్లాడుతున్న వాసు కె.యాదవ్

పంజాగుట్ట, జూలై24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ కదిరె కృష్ణ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రలను సహించమని బహుజనసేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వాసు కె.యాదవ్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్‌లు హెచ్చరించారు. చీకోటి ప్రవీణ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెంకటేశ్వర స్వామిపై కదిరె కృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేశారని చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా, సునీత, రాజేష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



రెజిమెంటల్ బజార్‌లో పూర్తయిన సీసీ రోడ్డు

ఎమ్మెల్యే చొరవతో పూర్తయిన సీసీ రోడ్డు

రెజిమెంటల్‌బజార్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించడంతో పూర్తయింది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బస్తీ పర్యటనకు వచ్చినపుడు మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌వాసులు సీసీ రోడ్డు నిర్మాణం గూర్చి ఫిర్యాదు చేశారు. సాధ్యమైనంత త్వరలో సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని బస్తీవాసులకు ఇచ్చిన హామీ మేరకు రూ.19.70లక్షల నిధులు మంజూరి చేయించి, పనులు ప్రారంభించారు. మంగళవారంతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. సీసీ రోడ్డు నిర్మాణంలో చొరవ చూపిన ఎమ్మెల్యేకు బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సవరాలబస్తీవాసులు

కొండగట్టు ఆలయ టెండర్లను దేవాదాయశాఖ

కమిషనర్ కార్యాలయంలో నిర్వహించాలి

బౌద్ధనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ టెండర్లను నగరంలో దేవాదాయ ధర్మదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించాలని సీతాఫల్‌మండి సవరాలబస్తీకి చెందిన బస్తీవాసులు దేవాదాయశాఖ కమిషనర్‌ను కోరారు. సవరాలబస్తీకి చెందిన యువనాయకుడు పొగర్తి భువనరావు, ఎల్లయ్య తదితరులు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో జరిగే తలనీలాల టెండర్ల విషయంలో కొంతమంది విలేకరులు (ఆంధ్రజ్యోతి కాదు) జోక్యం చేసుకుని టెండర్లకు అడ్డుపడుతున్నారని, దౌర్జన్యం చేస్తున్నారని, దీంతో తాము టెండర్లను బహిష్కరించామని వారు తెలిపారు. బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ టెండర్లను నిర్వహించాలని కోరుతూ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించామని భువనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు కె.వెంకటేశ్, మహేశ్, అంజనేయులు, బాబురావు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియమనిబంధనలను తెలియజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఎస్పీ కళాశాలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన

పద్మారావునగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో బుధవారం ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డుపై వాహనాలను నడిపే సందర్భంలో ప్రమాదాల నివారణకు తప్పక నియమాలను పాటించాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండి, చెల్లుబాటగు డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే వాహనాలను నడపాలని, సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలను నడపటం, అతివేగం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాన్ని నడపరాదని, వాహనాలను నడిపే సందర్భంలో నియమాలను పాటిస్తే, రోడ్డు ప్రమాద మరణాలను చాలా వరకు తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు కె.వేణుగోపాల్, అనిల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.హేమలత,వైస్ ప్రిన్సిపాల్ డా.టి.అమరనాధ శర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అఫీసర్స్ కె.బాబు, టి.రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

తిరుమలగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రిలో అత్యవసర సేవలు ప్రారంభం అయ్యేవిధంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వంశాతిలక్ అన్నారు. తన తల్లి మాజీ మంత్రి దివంగత టీ.ఎన్.సదాలక్ష్మి 28వ వర్ధంతిని పురస్కరించుకుని ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీఎస్.సదాలక్ష్మి ట్రస్ట్ ద్వారా పేద వర్గాలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. బొల్లారంలో ట్రస్ట్ ద్వారా పేద వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని చెప్పారు. అదేవిధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా వైద్య పరికరాలు రోగులకు మరిన్ని పడకలు సమకూర్చడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం టి.ఎన్.సదాలక్ష్మి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధనుంజయ చారి, బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీకాంత్, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

దళితులు, గిరిజనుల సమగ్ర అభివృద్ధిపై

అసెంబ్లీలో చర్చించాలి

- ఎమ్మెల్యే తలసానికి డీబీఎఫ్ విన్నపం

మారేడుపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): 2024 - 25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఎస్సీల జనాభా ప్రకారం నిధులు కేటాయించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ అంబేడ్కర్ అభయ హస్తం తదితర పథకాల అమలు కోసం అసెంబ్లీలో చర్చించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు దళిత బహుజనఫ్రంట్ విన్నవించింది. బుధవారం తలసాని నివాసంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పనలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ నేతలు పి.శంకర్, పులి కల్పనలు మాట్లాడుతూ.... దళితుల సమగ్ర అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కేటాయింపు చట్టం 2017 ప్రకారం దళితుల జనాభాకు 18 శాతం ప్రకారం నిధులు కేటాయించాలని కోరారు. దళితుల, గిరిజనుల సంక్షేమ, అభివృద్ధి, రక్షణలను అమలుచేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు.



సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ (కాచిగూడ బ్రాంచి)లో యూనియన్ నాయకులు బుధవారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీ.హెచ్.శంకర్‌రావు సమక్షంలో యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు, హైదరాబాద్ డివిజనల్ కార్యదర్శి కృష్ణ, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌లతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

ఘనంగా లాల్‌బజార్ బోనాల పండుగ

డప్పుల దరువు..
శివసత్తుల పూనకాలు..
పోతరాజుల విన్యాసాలతో
బుధవారం లాల్‌బజార్‌లోని
మహాకాళి
దేవాలయం బోనాల జాతర
అంగరంగవైభవంగా ప్రారంభమైంది.

తిరుమలగిరి జులై 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లాల్‌బజార్‌లోని మహాకాళి దేవాయలంలో రెండు రోజులపాటు జరగనున్న బోనాల జాతరలో మొదటి రోజు బుధవారం స్థానిక మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో తరలి వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బోనాలతో దేవాలయం ప్రాంగణం కిక్కిరిసిపోయింది. నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. పోలీసు ఉన్నతాధికారులు నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరామాళ్, అడిషనల్ డీసీపీ అశోక్, ఏసీపీ రమేష్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ సత్యచంద్రారెడ్డి, మహాకాళి మందిరం అధ్యక్షులు మురళీ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భక్తవత్సలం భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.



లాల్‌బజార్ మహాకాళి అమ్మవారు



తిరుమలగిరి విలేజ్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తిరుమలగిరి విలేజ్‌లో..

తిరుమలగిరి విలేజ్‌లోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. అధ్యక్షులు నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. తిరుమలగిరి విలేజ్‌కు చెందిన మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, రాష్ట్ర మైనారిటీ సెల్ కన్వీనర్ రేమండ్ హార్వర్డ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మైఖేల్ అబ్రహాం, ఉదయ్ రెడ్డి, అరుణ్, శ్రీకాంత్, కృష్ణ, కిరణ్, కార్తిక్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బోయినపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బోయినపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన విక్రమ్‌కుమార్ బల్వాడా (24) కొంత కాలంగా బోయినపల్లి సీతారాంపురం సాయిబాబా కాలనీలో నివాసం ఉంటూ డీహెచ్ఎల్ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కంపెనీకి సంబంధించిన వాహనాలకు రిపేర్ చేసే బలరాం అలియాస్ బాలుతో పరిచయం ఏర్పడింది. తనకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, వేరే పని కావాలని బలరాంను విక్రమ్ అడిగాడు. కొన్ని రోజులుగా నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న బలరాంకు గాంజా స్మగ్లర్లతో సంబంధం ఉండడంతో విక్రమ్‌ను ఈ వ్యాపారంలోకి దింపాడు. 25కిలోల గాంజా ప్యాక్‌లను విక్రమ్‌కు ఇచ్చి ఓ వ్యక్తికి అందించి డబ్బులు తీసుకోవాలని బలరాం చెప్పాడు. సాయిబాబా కాలనీలో ఓ ఖాళీ ప్రదేశంలో బలరాం చెప్పిన వ్యక్తి కోసం విక్రమ్ వేచి ఉన్నాడు. సమాచారం అందుకున్న బోయినపల్లి ఎస్సై నాగేంద్రబాబు సిబ్బందితో అక్కడికి వెళ్లి సోదాలు చేయగా, రూ.6లక్షల 33వేల విలువ చేసే 25 కిలోల గంజాయిని గుర్తించారు. విక్రమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, పరారీలో ఉన్న బలరాం కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

రెజిమెంటల్‌బజార్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి చెందాడు. వారం రోజుల క్రితం ఓ వృద్ధుడు సికింద్రాబాద్‌లోని సప్తగిరి లాడ్జ్ వైపు నుంచి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని ఫోర్ వీలర్ వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. వాహనాన్ని డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. సమీపంలో ఉన్న వారు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా గాయపడిన వృద్ధుడిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి వయస్సు 70సంవత్సరాలు ఉంటుందని, అతడి బంధువులు ఎవరైనా మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.



గుర్తు తెలియని మృత దేహం



ఫలహారబండ్ల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న లాలాగూడ సీఐ కరుణాకర్‌రెడ్డి

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

బౌద్ధనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, సబ్‌ఇన్‌స్పెక్టర్ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ బోలక్‌పూర్‌కు చెందిన మొయిన్‌సుల్తానా(28) స్థానికంగా పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. స్నేహితుడు పుట్టినరోజు వేడుకలకు మంగళవారం రాత్రి మల్కాజ్‌గిరి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున మూడుగంటల ప్రాంతంలో హోండా యాక్టివ్‌పై తిరిగి వస్తుండగా, తార్నాక మెట్రోపిల్లర్ 1084వద్ద యూటర్న్ తీసుకుంటుండగా సికింద్రాబాద్‌వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన మొయిల్‌సుల్తానా అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. సోదరుడు మన్సూర్‌సుల్తానా ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని, సీసీ కెమేరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహానికి గాంధీమార్చురీలో పోస్ట్‌మార్టమ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

పోలీస్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

- సీఐ కరుణాకర్ రెడ్డి

అడ్డగుట్ట, ఆగస్ట 24 (ఆంధ్రజ్యోతి) : మహాకాళి బోనాల సందర్భంగా పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని లాలాగూడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి ఫలహారబండ్ల నిర్వాహకులను హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తమ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించే మహాకాళి బోనాల సందర్భంగా ఫలహార బండ్ల నిర్వాహకులకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీసుల నిబంధనలను బేఖాతర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులతో సత్సంబంధాలు పెట్టుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో డీజే ఆర్కెస్ట్రా ఎవరికీ అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఫలహార బండ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంను అందజేస్తున్న జంపన్న ప్రతాప్‌తో దాత ప్రకాష్ భాంటియా

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

జంపన ప్రతాప్

బోయిన్‌పల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే పాఠశాలస్థాయి నుంచి క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలనే సంకల్పంతో దాతలు ముందుకువచ్చి క్రీడా సామగ్రిని అందించాలని కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పేర్కొన్నారు. త్వరలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ పాఠశాలకు క్రీడా సామగ్రితో పాటు స్పోర్ట్స్ యూనిఫాం అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం స్థానికంగా ఉండే జంపనప్రతాప్‌కు విషయం తెలిపారు. దీంతో ఆయన ప్రముఖ పారిశ్రామికవేత్త ది హ్యూమన్ ఫౌండేషన్ చైర్మన్ ప్రకాష్ బాంటియా సహకారంతో విద్యార్థులకు సుమారు 30వేల రూపాయలు విలువచేసే నూతన స్పోర్ట్స్ డ్రెస్ కిట్లను తయారు చేయించారు. ఈ క్రమంలో బుధవారం బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వ్యాయామ ఉపాధ్యాయురాలు జ్యోతి, ప్రిన్సిపాల్ ఆశీర్వాదం సమక్షంలో విద్యార్థులకు జంపన ప్రతాప్‌తో కలిసి ప్రకాష్ బాంటియా స్పోర్ట్స్ కిట్లను అందించడం జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు జి.షద్రక్, సామాజిక కార్యకర్త బాలాజీ, కంటోన్మెంట్ సిరాజు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీనారాయణరెడ్డి



బి.లక్ష్మీనారాయణరెడ్డి

బోయిన్‌పల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి బోనాల ఉత్సవాలను ప్రజలంతా శాంతియుతంగా జరుపుకోవాలని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీనారాయణరెడ్డి సూచించారు. బోయిన్‌పల్లి బోనాల ఉత్సవాల్లో భాగంగా బుధవారం తొట్టెల ఊరేగింపు ప్రాంతాలను ఆయన పరిశీలించడంతో పాటు ఆయా ప్రాంతాలలోని నిర్వాహకులను పిలిచి పలు సూచనలు సలహాలను చేశారు. ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ బోనాల వేడుకల తరువాత బోయిన్‌పల్లిలో జరిగే బోనాల ఉత్సవాలు పెద్దవి అన్నారు. దీనికితోడు మహిళలకు ఉచిత బస్సులు నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుండి మహిళా భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, ఇందుకోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బోయిన్‌పల్లి జాతర జరిగే ఏడుగుడుల దేవాలయం పరిసర ప్రాంతాలలో ఉన్న కెమెరాలతోపాటు మరికొన్ని ప్రత్యేక కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా భక్తులకు రక్షణగా షీ టీమ్‌లు పనిచేస్తాయన్నారు. ప్రతి ఒక్కరు పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కల్పిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కేసులు తప్పవని హెచ్చరించారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తల్వార్, కత్తులు లాంటి వాటితో నృత్యాలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేయాలని సూచించామన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఆలయాల కమిటీ సభ్యులు, నిర్వాహకులకు ఏర్పాటుచేయనున్న సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరై పోలీస్‌శాఖ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు పిట్లనగేష్

అడ్డగుట్ట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు పిట్లనగేష్ బుధవారం మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అడ్డగుట్టలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారని, స్థానిక సంస్థలో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. గొల్ల కురుమలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారులకు అకౌంట్లో డబ్బులు వేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. బీసీ సబ్‌ప్లాన్ విషయంలో 20వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం 8నెలలు గడుస్తున్నా నిధులు విషయంపై ఎటువంటి ప్రణాళికా చర్యలు తీసుకోలేదన్నారు. ముఖ్యంగా ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖను ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదన్నారు. చిరు వ్యాపారులతోపాటు విద్యార్థులకు వడ్డీ లేకుండా పూచీకత్తు లేకుండా రూ.10లక్షల రుణాలు ఇస్తామని ఇచ్చి మరిచిపోయారన్నారు. ఇప్పటి వరకు ముదిరాజ్, గంగపుత్ర, గౌడ్, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక సమాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చలేదన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకుండా వారం రోజుల్లో లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టర్ల కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ ఫిషరీస్ రాష్ట్ర కో-కన్వీనర్ దీపిక, వాణి, ఓబీసీ నాయకులు వెంకటాచారి, వీరవర్ధన్, హరి, సంజయ్, గోనె సత్యనారాయణ, చిన్న వీరన్న, రామకృష్ణ, సందీప్, పిట్ల సురేష్, నగేష్, చందర్‌లు పాల్గొన్నారు.



మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ ఓబీసీ నాయకులు

ప్రభుత్వ పాఠశాలలో నోటుపుస్తకాల పంపిణీ

పద్మారావునగర్, జులై 24 (ఆంధ్రజ్యోతి): బన్సీలాలపేట్ డివిజన్ పరిధి కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఒకటి, రెండవ తరగతి విద్యార్థులకు సికిందరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ సభ్యులు నోటు పుస్తకాలు, స్టేషనరీ ఐటెంలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులు బాగా చదువుకోవాలని, ప్రస్తుతం వారికి అవసరమైన పుస్తకాలను అందజేస్తున్నామని, భవిష్యత్తులో వారికి మరేమైనా అవసరం ఉంటే అందించేందుకు తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన అసోసియేషన్ సభ్యులకు మల్లికార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నిఖిల్ జోగిపర్తి, ప్రధానకార్యదర్శి వినిత్ రాచమల్ల, కోశాధికారి సందీప్ బూరుగు, మహదేవన్ రవి, రఘు, మేకలమండి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఈ.చంద్రశేఖర్, కోశాధికారి వీజే.శేషగిరిరావు, పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున రెడ్డి, ఉపాధ్యాయులు సునీత, పరుశురామ్, మహేశ్, సరిత, నిత్య పాల్గొన్నారు.



స్థానిక కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బోర్డ్ సభ్యుడు జే.రామకృష్ణ

సమస్య ఏదైనా పరిష్కారం మా లక్ష్యం

బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ

మారేడుపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో ఏ సమస్య ఉన్నా పరిష్కరించడం మా బాధ్యత అని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. బుధవారం కంటోన్మెంట్‌లోని కాకగూడ, బ్రూక్‌బాండ్ కాలనీలో బస్తీబాట నిర్వహించిన రామకృష్ణ స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కాకాగూడ హనుమాన్ ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం, బ్రూక్‌బాండ్ కాలనీలో మురుగునీటి కాలువ నిర్మాణానికి సంబంధించిన సమస్యను తెలుసుకుని త్వరలోనే వాటి నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ నిధులు విడుదల చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ బాధ్యతగా నిధులు ఇస్తే కంటోన్మెంట్ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాసెట్టి కృష్ణ, బిక్షపతి, శంకర్, బాలకృష్ణ, అనీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇందిరాలక్ష్మీనగర్ బస్తీలో వెలగని వీధిదీపాలు

అడ్డగుట్ట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): లాలాగూడ ఫీడర్ పరిధిలోని ఇందిరాలక్ష్మీనగర్ బస్తీలో గత పదిహేను రోజుల నుంచి వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ట్యూషన్ నుంచి ఇంటికి వస్తున్న చిన్నారులు కుక్కల భయంతో వణికిపోతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం చూపెట్టడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఇందిరాలక్ష్మీనగర్ బస్తీలో వీధి దీపాలు పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా చందర్



బౌద్ధనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ చైర్మన్ డి.చందర్‌తో పాటు నలుగురు ట్రస్టబోర్డు సభ్యులను నియమిస్తూ దేవాదాయ ధర్మదాయాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక కార్యకర్తగా పలు సేలు అందించిన నామాలగుండుకు చెందిన చందర్‌ను ఆలయచైర్మన్‌గా నియమించటంతో పాటు సభ్యులుగా కైలాస్ అరుణ్‌కుమార్, నరేష్, చింతల హేమలత, నవీన్‌కుమార్‌తో పాటు ఎక్స్ అఫిషియోసభ్యుడిగా ప్రధానార్చకులు పాలకుర్తి ప్రణవ్‌కుమార్‌ను నియామించారు. గురువారం ఉదయం పదకొండుగంటలకు నామాలగుండు ఆలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అండాళ్ సమక్షంలో వీరు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.



బీదలబస్తీలో మురుగునీటి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బీదలబస్తీలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీదలబస్తీలో కొన్నిరోజులుగా నిరంతరం పొంగుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కారించామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. బుధవారం ఆమె బీదలబస్తీలో అధికారులతో కలిసి పర్యటించారు. పాతడ్రైనేజీ లోపల చెట్ల వేర్లు పాతుకుపోవటంతో పైపులకు పగుళ్ల వచ్చాయని, దీంతో మురుగునీరు రోడ్లపై పారుతుందని కార్పొరేటర్ తెలిపారు. పాత పైపుల స్థానంలో నూతన పైపులైన్‌లను ఏర్పాటు చేస్తున్నామని, బీదలబస్తీలో ఇక మురుగునీటి సమస్య ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఇన్‌చార్జి మేనేజర్ వరుణ్, నాయకులు శేఖర్, మురళీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కరెంట్ బిల్లుల పేరుతో మోసం

ఉచిత కరెంట్ బిల్లుల పేరుతో ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో కొంత మంది మహిళలు కార్పొరేటర్ సామల హేమ దృష్టికి తీసుకువచ్చారు. కరెంట్‌బిల్లులను ఏఈ, లైన్‌మెన్‌లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, బోనాలు పండుగ అయిన తర్వాత కరెంట్‌బిల్లులు కడతామన్నా వినకుండా కరెంట్ కట్‌చేసి వెళ్లుతున్నారని కార్పొరేటర్ దగ్గర వాపోయారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తామని కార్పొరేటర్ తెలిపారు.